క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని చీకటిపేట గ్రామ సర్పంచ్ మూడడ్ల పార్వతి కుటుంబాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం కలిసి పరామర్శించారు. సర్పంచ్ భర్త దాలినాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చీకటిపేటలో వారి ఇంటికి వెళ్లి, దాలినాయుడు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నేడు పార్టీ విస్తృత స్థాయి సమావేశం

రాజాం: స్థానిక సూర్యదుర్గ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయం అధికారులు ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. సమావేశానికి పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నారని నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణులంతా హాజరు కావాలని కోరారు.

ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి



పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఆర్డర్ కాపీలు అందజేస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 27 మంది ఎస్జీటీ(సెకెండరీ గ్రేడ్ టీచర్)లకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించినట్లు ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు నియామకపత్రాలు సోమవారం అందజేసిన ఆయన ఆర్డర్లు అందుకున్న వారిలో రేగిడి మండలంలోని ఉపాధ్యాయులు 14 మంది, పొరుగు మండలాలకు చెందిన ఉపాధ్యాయులు 13 మంది ఉన్నారని పేర్కొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ ఏర్పాటు



పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీని అభినందిస్తున్న నాయకులు

రేగిడి: స్థానిక పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సోమవారం ఏర్పాటు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు తెలిపారు. చైర్మన్, మెడికల్ ఆఫీసర్ కన్వీనర్‌గా ఎంపీపీ దార అప్పలనరసమ్మ, సభ్యులుగా తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, రేగిడి సర్పంచ్ కిమిడి రేణుకమ్మ, కొమిర సర్పంచ్ పాడి గౌరీశ్వరమ్మ, రేగిడి పీహెచ్‌సీ రెండో వైద్యాధికారి సోహిని రాఘవ ఎంపికయ్యారని పేర్కొన్నారు.

భూ హక్కు పత్రాల పంపిణీ



అప్పలరాజుపేటలో రైతులకు భూ హక్కు పత్రాలు అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

రామభద్రపురం: మండలంలోని అప్పలరాజుపేటలో రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలు సోమవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ పి.గణపతిరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాల పరిష్కారానికి ప్రభుత్వం జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా భూముల రీ సర్వే చేస్తోందని, దీంతో చాలామంది రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. సర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతులకు భూ హక్కు పత్రాలు అందజేస్తున్నామన్నారు.

16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

సంతకవిటి: మండలంలో 16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వ్యవసాయ శాఖ మండల అధికారి పైల నవీన్ సోమవారం తెలిపారు. మండలంలోని తాలాడ గ్రామంలో రైతుల ధాన్యం నిల్వలను పరిశీలించిన ఆయన వెంటనే గ్రామ సచివాలయ ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి, అమ్మకాలు చేపట్టాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సోమవారం మండలంలోని ఆమదాలవలస కాలనీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర ప్రజల బాగోగుల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయన ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. ఇప్పుడు గ్రామాల్లోనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. అప్పటి పాలనకు ఇప్పటి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. అందుకే గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు సాదర స్వాగతం పలుకుతున్నారని, సీఎం జగనన్న పాలనపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారని ఇదంతా చూసి చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని, ఇదే ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ నాయకుడు, కార్యకర్త, అభిమాని కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, సర్పంచ్ కె.అప్పారావు, ఎంపీటీసీ టి.సుమతి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల మండల అబ్జర్వర్ పి.రామచంద్రినాయుడు, ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు, తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నాడు దోపిడీ పాలన.. నేడు సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: రాష్ట్రంలో నాడు చంద్రబాబు దోపిడీ పాలన చేస్తే నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఓ శుభకార్యానికి హాజరైన ఆయన ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుతో కలిసి మీడియాతో కాసేపు మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి మేలు చేయాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని, ప్రజలకు ఇంతమంచి చేసిన ముఖ్యమంత్రిని తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చూడలేదన్నారు. నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీలదే హవా నడిచేదన్నారు. వారు సూచించిన వ్యక్తులకే పథకాలు అందేవన్నారు. ఇప్పుడు మాత్రమే అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ఇప్పటి ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. అభివృద్ధి చేసేందుకే అని చెప్పి, పార్టీ ఫిరాయించిన రాజులు నియోజకవర్గంలోని ఏ గ్రామంలో అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజలను కనీసం పట్టించుకోని వారు ఏ ముఖం పెట్టుకుని, వారి వద్దకు ఓటు అడిగేందుకు వెళ్తారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా పార్టీ గెలుపుతో పాటు తాను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రతినిధి ఎ.నిర్మల, కొట్టక్కి సర్పంచ్ ఎ. అనురాధ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యుఎస్ రాయులు, పీఏసీఎస్ చైర్మన్ కె. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో దివ్యాంగులైన విద్యార్థులకు ట్రై సైకిళ్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ చదువుకునేందుకు ఏ అవయవ లోపం అడ్డుకాకూడదన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం అందజేస్తున్న ట్రై సైకిళ్లు, కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎల్.రత్నాకర్, ఎంపీడీఓ తివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై స్ప్రింక్లర్ పైపుల అందజేత



రైతులకు పైపులు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామంలో మహిళా రైతు గేదెల సత్యవతికి రాయితీపై ప్రభుత్వం అందించిన స్ప్రింక్లర్ పైపులను ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రూ.32,500 విలువైన ఈ పైపులను 50 శాతం రాయితీపై రైతులకు అందించడం జరుగుతోందన్నారు. వీటిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ జి.మురళీకృష్ణ, సర్పంచ్ కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఇంటి పన్ను వసూలు

రాజాం సిటీ: పక్కాగా ఇంటి పన్ను వసూళ్లు చేపట్టాలని ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం మండలంలోని పొగిరి గ్రామంలో వలంటీర్లతో సమావేశమైన ఆయన పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్య పనులు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పన్నుల వసూళ్లను వేగవంతం చేసి, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి



ఓటర్ సెల్ఫీ పాయింట్ ప్రారంభిస్తున్న ఆర్డీఓ శేషశైలజ

తెర్లాం: మండలంలో 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులంతా ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ డోల రాజేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఓటర్ సెల్ఫీ పాయింట్‌ను ఆర్డీఓ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓటు అనేది భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ కల్పించిన హక్కు అని దీనిని అందరూ సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. గ్రామాల్లో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. తహసీల్దార్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఓటు ద్వారా నిజాయతీపరులైన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే హక్కు ఓటర్‌కే సాధ్యమన్నారు. అనంతరం ఓటర్ సెల్ఫీ పాయింట్ వద్ద ఆర్డీఓ సెల్ఫీ తీసుకున్నారు.

వలసల నివారణకే ఉపాధి పనులు



బొబ్బిలి రూరల్: పెంట గ్రామంలో వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు

మెంటాడ: గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు పెరుగుతున్న వలసల నివారణకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం పనులు కల్పిస్తున్నారని ఎంపీడీఓ త్రివిక్రమ్ అన్నారు. మండల కేంద్రంలోని అనంతసాగరం చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన సోమవారం పరిశీలించి, చెరువు ప్రధాన గట్టు ఏర్పాటు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. రెండు పూటలా కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు.

సంతకవిటి: స్థానిక ఉపాధి కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ పి.రాధ సోమవారం సిబ్బందితో సమావేశమై, ఉపాధి పనుల నిర్వహణపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె పనుల గుర్తింపులో జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీఓ త్రినాథరావు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట, రంగరాయపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ అల్లు భాస్కరరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారుల మస్తర్లు చూసి, పలు సూచనలు చేశారు. కొలతల ప్రకారం పనులు చేయాలని, మస్తర్లు వేసిన తర్వాత పని ప్రదేశంలో వేతనదారులు లేకపోతే మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేతాజీ పోరాటం స్ఫూర్తిదాయకం



బొబ్బిలి రూరల్: నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



బాడంగి: గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నేతాజీకి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రాంబాబు, సిబ్బంది

బొబ్బిలి రూరల్:

దేశ స్వాతంత్య్ర సాధనకు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. మండలంలోని అలజంగి, పిరిడి, నారసింహునిపేట, నారాయణప్పవలస గ్రామ పాఠశాలల్లో సుభాష్‌చంద్ర బోస్ జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది, విద్యార్థులంతా కలిసి, చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత చరిత్ర, ఆజాద్ హింద్ ఫౌజ్ ద్వారా ఆయన కొనసాగించిన స్వాతంత్రోద్యమం తీరును వక్తలు వివరించారు.

బాడంగి: స్థానిక గురుకుల పాఠశాలలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది, విద్యార్థులంతా కలిసి, నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం భారత స్వాతంత్రోద్యమంలో ఆయన పోషించిన పాత్రను సిబ్బంది వివరించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ పేరిట ప్రత్యేకంగా ఓ మిలటరీని ఏర్పాటు చేసి, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు.

తెర్లాం: స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ 126వ జయంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, పాఠకులంతా కలిసి, బోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు కొనియాడారు.

సంక్షిప్తంగా...

సీపీఎం ధర్నా

బొబ్బిలి: పేదలకు భూములు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు సోమవారం ధర్నా చేపట్టారు. రామభద్రపురం మండలంలోని గొల్లలపేట రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబర్–210లోని 11.30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ రిటైర్డ్ అధికారి ఆక్రమించుకుని అనుభవిస్తున్నారని, అదే భూమిని భూమిలేని నిరుపేదలకు ఇచ్చి ఆదుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పి. శంకరరావు కోరారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

వంగర: మండల పరిధి మద్దివలస గ్రామం సమీపంలో ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు గాయాల పాలయ్యారు. కె. కొత్తవలస గ్రామానికి చెందిన గర్భాపు అప్పయ్య ఎం.సీతారాంపురం గ్రామం నుంచి స్వగ్రామం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుకగా వస్తున్న కె. ఆదినారాయణ బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ వాహనాల పైనుంచి రోడ్డు మీద పడి గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వారికి ప్రాథమిక చికిత్స అందజేసి రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాజాం సిటీ: మండల పరిధిలోని పొగిరి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఎస్ఐ పి.నీలావతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జి.సిగడాం గ్రామానికి చెందిన మందుల శంకరరావు, విద్య సంతకవిటి మండలంలోని సురవరంలో జరుగుతున్న జాతరకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. పొగిరి జంక్షన్‌కు వచ్చేసరికి శ్రీకాకుళం నుంచి రాజాం వైపు వస్తున్న కారు ఢీకొనడంతో వారికి గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం రాజాంలోని ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: స్థానిక మెంటిపేట ఎస్సీ కాలనీకి చెందిన దేవులపల్లి వెంకటేష్ అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపారు. ఈ నెల 19వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన ఇంతవరకు తిరిగిరాలేదని, బంధువులు ఇళ్లతో పాటు తమకు తెలిసిన వారందరికి ఫోన్ చేసి, అడిగామని అయినా ఫలితం లేదని తండ్రి అప్పలస్వామి ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వినతిపత్రం అందజేత

బొబ్బిలి రూరల్: తమ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మండలంలోని గోపాలరాయుడిపేట పంచాయతీ పరిధిలో ఉన్న సీహెనువలస, కృపావలస, దీవెనవలస, రామన్నవలస, చిన్నఅక్కేనవలస గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టి, తహసీల్దార్ రాజారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.సాంబయ్య పాల్గొన్నారు.

కుళాయి ఏర్పాటు పనులు ప్రారంభం

తెర్లాం: జలజీవన్ మిషన్‌లో భాగంగా మండలంలోని ఉద్దవోలు గ్రామంలో ఇంటింటి కుళాయి ఏర్పాటు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. పనులు త్వరితగతిన పూర్తి చేసి, గ్రామస్తులకు సురక్షితమైన తాగునీటిని అందజేస్తామని సర్పంచ్ ఎచ్చెర్ల సునీత తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

రాజాం సిటీ: పట్టణంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సోమవారం పరిశీలించారు. నెయ్యల వీధిలో చేపట్టిన గ్యాంగ్ వర్క్‌ను చూసిన ఆయన కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించాలని తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

తెర్లాం: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని పెరుమాళి హైస్కూల్‌లో టెక్కలివలసకు చెందిన చిన్నారి అన్విక ఫస్ట్ బర్త్ డే సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం సోమవారం చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో బాదం, క్రిస్మస్ మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

తెర్లాం: చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని బాడంగి సీహెచ్‌సీ వైద్యాధికారి విశ్వనాథ్ అన్నారు. సోమవారం స్థానిక ఐదో అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల ఆరోగ్యం తనిఖీ చేసి ప్రతిరోజూ చిన్నారులకు పౌష్టికాహారం అందివ్వాలన్నారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ

తెర్లాం: మండలంలోని పెరుమాళి గ్రామంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో ఎంతమంది విద్యార్థులు ఉంటున్నారని, విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయా.. లేదా అనే విషయం వసతి గృహ సంక్షేమ అధికారి కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు పడుకునేందుకు వినియోగించే మంచాలు, గదులు, వంటగది, పరిసరాలు, సరుకుల నిల్వలు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, చూడాలని, వసతి గృహం ఆవరణలో జంగిల్స్‌ను క్లియర్ చేయాలని సిబ్బందికి సూచించారు.

సీఎం జగన్ వెంటే జనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

బొబ్బిలి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే రాష్ట్ర జనమంతా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కుమారుడు మాజీ మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో పాదయాత్ర చేయనున్న నేపథ్యంలో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన లోకేష్ పాదయాత్రకు ప్రభుత్వం అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తుందన్న టీడీపీ నేతల దుష్ప్రచారం తగదన్నారు. చట్టాలు, నిబంధనల మేరకు ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయన్నారు. ఎవరు ఏ యాత్ర చేసుకున్నా 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. గతంలో పాలించిన టీడీపీ నాయకులు ప్రజలకు ఏం చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. తాము, తమ పార్టీ, ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఏయే హామీలు ఇచ్చామో, వేటిని అమలు చేశామో ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి చెప్పగలుగుతున్నామన్నారు. అనవసరంగా టీడీపీ, ఎల్లోమీడియా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, వాటిని మానుకోకపోతే వారే ప్రజల్లో నవ్వుల పాలవుతారన్నారు. రాష్ట్ర సర్వోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తమ నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే మళ్లీ ప్రజలు పట్టంగడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు ఉన్నారు.

ముగిసిన బాలఅన్నమ్మ జాతర



బాలఅన్నమ్మ పేరంటాలుకు పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు ఘటాలతో వెళ్తున్న భక్తులు

సంతకవిటి: మండలంలోని సురవరం గ్రామంలో గత కొన్నిరోజులుగా జరుగుతున్న బాలఅన్నమ్మ పేరంటాలు జాతర మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. రాజాం, సంతకవిటి, రేగిడి, పొందూరు, జి.సిగడాం మండలాలకు చెందిన పలువురు అధికారులు, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలకు చెందిన పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. సురవరం, మామిడిపల్లి, మండాకురిటి, అన్నమ్మరాజుపేట, నారాయణరాజుపురం గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు.

భూముల రీసర్వేపై సమీక్ష



సమీక్ష సమావేశంలో రెవెన్యూ సిబ్బందికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం సమావేశమై, భూముల రీసర్వేపై సమీక్షించారు. పక్కాగా సర్వే చేపట్టి, రైతుల భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఎన్నో ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ సమస్య పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టిందన్నారు. భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు రాకుండా రైతుల భూములను పక్కాగా ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. చీపురుపల్లి ఆర్డీఓ అప్పారావు మాట్లాడుతూ గతంలో కన్నా ప్రస్తుతం భూ వివాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. గ్రామాల్లో పెద్దగా భూ సమస్యలు లేవని, ఆస్తి పంపకాలు వంటి చిన్నచిన్న సమస్యలు మాత్రమే కనిపిస్తున్నాయన్నారు. వీటిని గ్రామస్థాయిలో పెద్దల సమక్షంలో వెంటనే పరిష్కరించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రాజాం, సంతకవిటి, రేగిడి, వంగర మండలాల తహసీల్దార్లు డీటీ సాయికామేశ్వరరావు, ఎ.సులోచనరాణి, ఎ.కల్యాణ చక్రవర్తి, ఐజాక్, పార్టీ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, పి. లక్ష్మణరావు, రాజాం జెడ్పీటీసీ బి.నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, వంగర ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలతో పాటు అన్ని వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని అప్పయ్యపేటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలు వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా రాతలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, పట్టణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు ఐ.గోపాలరావు, ఎస్.వేణుగోపాలనాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.